క్లుప్తంగా

బకాయిలు రద్దు చేయాలి



నల్లబెల్లి : ఎస్సీ, ఎస్టీల విద్యుత్ బకాయిలను వెంటనే రద్దు చేయాలని అణగారిన వర్గాల ఐక్యవేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు పరికి కొర్నేల్ అన్నారు. ఈ మేరకు ఆ సంఘం ఆధ్వర్యంలో మండల కేంద్రంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఎస్సీ, ఎస్టీ కుటుంబాలకు ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్న 100 యూనిట్స్‌ను 150 యూనిట్స్‌కు పెంచాలని కోరారు. నాయకులు పాడేటి సాగర్, నాగెల్లి ఎసేబు, కోయల కన్నయ్య, మార్తా నాగరాజు, పట్టల రాజారాం తదితరులు పాల్గొన్నారు.

పోలీస్‌స్టేషన్‌కు చేరిన 'పది' ప్రశ్నపత్రాలు



చెన్నారావుపేట : స్థానిక పోలీస్ స్టేషన్‌కు పదో తరగతి వార్షిక పరీక్ష పత్రాలు సోమవారం చేరుకున్నాయి. ఈ సందర్భంగా జిల్లా రూట్ ఆఫీసర్లు కొర్ర సారయ్య, రమేష్‌బాబు మాట్లాడుతూ పదో తరగతి వార్షిక పరీక్ష సెట్-1 ప్రశ్న పత్రాలు ఏఎస్సై లక్ష్మణమూర్తి సమక్షంలో స్ట్రాంగ్ రూంలో భద్రపరిచామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్కార్ట్ పోలీసులు విద్యాసాగర్, రాజు, చీఫ్ కస్టోడియన్‌లు వెంకటరాం నర్సయ్య, ప్రసన్నలక్ష్మి, డిపార్ట్ ఆఫీసర్లు ఉమా మహేశ్వర్, రజిని, సీఆర్‌పీ సంపత్ సిబ్బంది ఉన్నారు.

రాయపర్తి : ఏప్రిల్ 3నుంచి 12వరకు నిర్వహించే పదోతరగతి పరీక్షల నేపథ్యంలో ప్రశ్నపత్రాలను సోమవారం పోలీస్‌స్టేషన్‌లో భద్రపర్చినట్లు చీఫ్ సూపరింటెండెంట్లు రావుల భాస్కర్‌రావు, రవికుమార్ తెలిపారు. కార్యక్రమంలో డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్లు రామచంద్రం, శ్రీనివాస్ పాల్గొన్నారు.

'తీవ్రంగా నష్టపోయాం'

కొనాయమాకుల వద్ద రైతుల ధర్నా



గీసుకొండ : అకాల వర్షం, వడగళ్లతో తాము తీవ్రంగా నష్టపోయామని, ప్రభుత్వం సాయం అందించి ఆదుకోవాలని కోరుతు పలు గ్రామాల రైతులు సోమవారం ధర్నా చేపట్టారు. గీసుకొండ, కొనాయమాకుల, రాంపురం, మనుగొండకు చెందిన రైతులు కొనాయమాకుల బస్‌స్టేజీ వద్ద మధ్యాహ్నం రోడ్డుపై బైఠాయించడంతో ఇరువైపులా వాహనాలు నిలిచిపోయాయి. స్వయంగా కలెక్టర్ పర్యటించి పంట చేలను పరిశీలించాలని, త్వరగా నష్టపరిహారం వచ్చేలా చూడాలని రైతులు కోరారు. తహసీల్దార్ విశ్వనారాయణ రైతులతో మాట్లాడి వారి సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకుని వెళతానని చెప్పడంతో వారు ఆందోళన విరమించారు. గీసుకొండ ఇన్‌స్పెక్టర్ సట్ల రాజు, ఎస్సై వెంకన్నలు ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు. రైతులకు సంఘీభావంగా ఎంపీపీ భీమగాని సౌజన్య, నాయకులు చాడ కొమురారెడ్డి, తుమ్మనపెల్లి శ్రీనివాస్, ఆకుల రుద్రప్రసాద్, వజ్ర రాజు, పీసాల రాజు, వెంకటేశ్ తదితరులు ధర్నాలో పాల్గొన్నారు.

ఆర్థికసాయం

సంగెం : మండల కేంద్రానికి చెందిన ఫొటోగ్రాఫర్ చిట్టిమళ్ల వినోద్‌కుమార్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. ఎలాంటి ఆస్తిపాస్తులు లేని వినోద్ కుటుంబానికి స్థానిక పోలీసులు, మండల కేంద్ర వాసులతో పాటుగా పలు గ్రామాలకు చెందిన దాతలు వాట్సాప్ ద్వారా స్పందించి అందించిన రూ.1.42 లక్ష, 50 కేజీల బియ్యం బాధిత కుటుంబానికి సోమవారం అందించారు. సర్పంచ్ గుండేటి బాబు, ఉప సర్పంచ్ శరత్‌బాబు, ఎంపీటీసీ మల్లయ్య, హెడ్‌కానిస్టేబుల్ శ్రీనాథ్, నాయకులు గుండేటి కుమారస్వామి, సదయ్య, రమేష్, మోహన్, గంగాధర్, రాజశేఖర్, మోహన్, వెంకట్, మనోహర్, సంపత్ పాల్గొన్నారు.

జాషువా విగ్రహం ఏర్పాటుకు సహకరించాలి

నర్సంపేట : నర్సంపేటలోని పాకాల జంక్షన్‌లో విశ్వ ప్రజాకవి గుర్రం జాషువా శాశ్వత నూతన కాంస్య విగ్రహం ఏర్పాటుకు సహకరించాలని మహాజన సోషలిస్టు పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కల్లెపల్లి ప్రణయ్‌దీప్, దళిత ప్రజా సంఘాల జేఏసీ కో కన్వీనర్, డీపీఆర్‌పీఎస్ జాతీయ అధ్యక్షుడు అందె రవి, మాల మహానాడు రాష్ట్ర కార్యదర్శి గుంటి ప్రకాశ్‌లు కోరారు. ఈ మేరకు మునిగె యాకుబ్ అధ్యక్షతన సోమవారం సమావేశం నిర్వహించారు. పాకాల జంక్షన్‌లో గుర్రం జాషువా శాశ్వత కాంస్య విగ్రహ ఏర్పాటుకు స్థానిక ఎమ్మెల్యే సహకరించాలని కోరారు. దళిత ప్రజాసంఘాల జేఏసీ కో కన్వీనర్ ఆగబోయిన రవి, బోయిని నారాయణ, ఆరోగ్యమ్మ, దామెర సుధాకర్, శ్రీనివాసచారి, ఉప్పలయ్య, రంజిత్, కుమార్, మల్లయ్య, వినయ్ పాల్గొన్నారు.

అభివృద్ధిని చూసి చేరికలు

- ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి
- ఉప్పరపల్లిలోనే 'గృహలక్ష్మి' ప్రారంభిస్తా..



చెన్నారావుపేట: పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి

చెన్నారావుపేట : బీఆర్ఎస్ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని చూసి పార్టీలో చేరుతున్నారని ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి అన్నారు. ఈ మేరకు మండలంలోని ఉప్పరపల్లి గ్రామానికి చెందిన సర్పంచ్ పెరుమాండ్ల శ్రీధర్‌రెడ్డి సోమవారం 200 కుటుంబాలతో ఎమ్మెల్యే పెద్ది సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉప్పరపల్లి ప్రజలు కల్మషం లేనివాళ్లన్నారు. గ్రామ అభివృద్ధికి కట్టుబడి ఉంటానని అన్నారు. ఇటీవల సీఎం ప్రకటించిన గృహలక్ష్మి పథకంను ఇక్కడి నుంచే ప్రారంభిస్తానని అన్నారు. గత పాలకుల కాలంలో ఎలాంటి అభివృద్ధి జరగలేదన్నారు.

కోనాపురంలో సీసీ రోడ్డు పనులు..

మండలంలోని కోనాపురం గ్రామంలో రూ.50లక్షలతో నిర్మిస్తున్న సీసీ రోడ్ల నిర్మాణ పనులకు సోమవారం ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డీబీఎం-40 కాల్వ ద్వారా రెండు పంటలకు సమృద్ధిగా నీళ్లు అందించామన్నారు. ఈ కార్యక్రమాలలో ఎంపీపీ బాదావత్ విజేందర్, జెడ్పీటీసీ బానోత్ పత్తినాయక్, కంది కృష్ణ చైతన్య రెడ్డి, సొసైటీ చైర్మన్ ముద్దసాని సత్యానారాయణరెడ్డి, మురహరి రవి, వైస్ చైర్మన్ చిందికింది వంశీ, ఎంపీటీసీ చెరుకుపల్లి విజేందర్‌రెడ్డి, మహ్మద్ రఫి, ఎంఏ గఫ్ఫార్, ఆర్‌బీఎస్ మండల కన్వీనర్ బుర్రి తిరుపతి, జిల్లా డైరెక్టర్ తూటి శ్రీనివాస్, మాజీ జెడ్పీటీసీ జున్నూతుల రాంరెడ్డి, మాజీ ఎంపీపీ జక్క అశోక్, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నాయకులు పాల్గొన్నారు.

'తప్పుడు ప్రకటనలను ఖండిస్తున్నాం'

చెన్నారావుపేట మండలంలోని ఉప్పరపల్లిలో జరిగిన బీఆర్ఎస్ పార్టీలో 200 కుటుంబాలు చేరినట్లు తప్పుడు మాటలు చెప్పడాన్ని ఖండిస్తున్నామని బీసీ సెల్ మండల అధ్యక్షుడు గుళ్లపెల్లి విజేందర్, ఉప సర్పంచ్ కాసాని రమేష్, గ్రామ పార్టీ అధ్యక్షులు వట్టె తిరుపతిరెడ్డిలు అన్నారు. ఈ మేరకు వారు ఉప్పరపల్లిలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు.

ఎమ్మెల్యేకు సన్మానం

నర్సంపేట : ముస్లిం మైనార్టీ షాదీఖానా కోసం నర్సంపేట ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి రూ.కోటి మంజూరు చేయించారు. ఈ మేరకు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మజీద్ కమిటీ సభ్యులు సోమవారం ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు నాగెల్లి వెంకటనారాయణగౌడ్, కౌన్సిలర్ మహ్మద్ పాషా, మునిసిపల్ కో ఆప్షన్ షేకియాకుబ్, పట్టణ మైనార్టీ సెల్ అధ్యక్షుడు షేక్ ఇర్ఫాన్, మజీదు కమిటీ సభ్యులు సదర్ మహ్మద్ అబ్బుల్‌నబీ, నాయబ్‌రసూల్, హబీబ్, అయుబ్, సయ్యద్‌జావిద్, షేక్ ఖాజాబాబా, ఎండి.ఖలీల్, ఫక్రుద్దీన్, నిజాంమౌలానా, తదితరులు పాల్గొన్నారు.

పేదలకు వరం సీఎంఆర్ఎఫ్

అనారోగ్యంతో బాధపడుతూ వైద్యం పొందేందుకు ఆర్థిక స్తోమత లేని నిరుపేదలకు సీఎం రిలీఫ్ ఫండ్ వరంలా మారిందని ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి అన్నారు. ఈ మేరకు నెక్కొండ మండల కేంద్రానికి చెందిన ఉల్లేరావు ప్రత్యూష గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతుండగా సోమవారం క్యాంపు కార్యాలయంలో రూ.2లక్షల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో నెక్కొండ మండల పార్టీ అధ్యక్షుడు, ముఖ్య నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

పేపర్ లీకేజీపై కేటీఆర్ రాజీనామా చేయాలి

- మాజీ ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి



దీక్షలో మాట్లాడుతున్న రేవూరి ప్రకాశ్‌రెడ్డి

నర్సంపేట : టీఎస్‌పీఎస్సీ పేపర్ లీకేజీపై నైతిక బాధ్యత వహిస్తూ మంత్రి కేటీఆర్ వెంటనే రాజీనామా చేయాలని మాజీ ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ పిలుపు మేరకు పట్టణంలోని ఆర్అండ్‌బీ అతిథి గృహం ఎదుట సోమవారం ఒక్క రోజు దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా ప్రకాశ్‌రెడ్డి మాట్లాడుతూ పేపర్ లీకేజీపై సిట్టింగ్ జడ్జితో విచారణ చేపట్టి రూ.లక్ష పరిహారం ప్రకటించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వడ్డేపల్లి నర్సింహరాములు, రేసు శ్రీనివాస్, బాల్నె జగన్, గంటి వీరప్రకాశ్, చుక్క రమేష్, చిలువేరు రజనిభారతి, మండల అధ్యక్షులు, యువమోర్చా నాయకులు, శక్తికేంద్ర ఇన్‌చార్జ్‌లు, బూత్ అధ్యక్షులు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

జాతర ప్రశాంతంగా జరుపుకోవాలి



గవిచర్లలో మాట్లాడుతున్న సీఐ శ్రీనివాస్

సంగెం : మండలంలోని గవిచర్లలో ఉగాది రోజున నిర్వహించే గుండయ్య, బ్రహ్మయ్య జాతరను పార్టీలకతీతంగా శాంతియుతంగా నిర్వహించుకోవాలని పర్వతగిరి సీఐ శ్రీనివాస్ అన్నారు. సోమవారం గవిచర్లలోని రైతు వేదికలో అఖిల పక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా వివిధ రాజకీయ పార్టీల నాయకులు సహకరించాలన్నారు. నిబంధనలకు విరుద్ధంగా ప్రవర్తించిన వ్యక్తులపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సుదర్శన్‌రెడ్డి, ఎంపీటీసీ సంపత్‌రెడ్డి, ఉప సర్పంచ్ యాకయ్య, కొంతం యాదగిరి, ఎస్సై భరత్, నాయకులు శ్రీనివాస్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

సంఘాభివృద్ధికి సభ్యులు సహకరించాలి



మాట్లాడుతున్న చైర్మన్ సత్యనారాయణరెడ్డి

చెన్నారావుపేట : సంఘాభివృద్ధికి సభ్యులు సహకరించాలని సొసైటీ చైర్మన్ ముద్దసాని సత్యనారాయణరెడ్డి అన్నారు. ఈ మేరకు మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం 66వ సాధారణ మహాసభ సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సభ్యులు మాట్లాడుతూ అకాల వర్షాలతో రైతులు నష్టపోయారని, వారికి రుణాలు అందించి ఆదుకోవాలన్నారు. ఈ సమావేశంలో జెడ్పీటీసీ బానోత్ పత్తినాయక్, చింతకింది వంశీ, సర్పంచ్ కుండె మల్లయ్య, సమ్మునాయక్, డైరెక్టర్లు జంగిలి బాబు, జున్నూతుల రమాదేవి, కంచ కోమల, మజ్జిగ రాంబాబు, మంచాల సరిత, ఎండీ బషీర్, బానోత్ పూల్‌శంకర్, ఎడ్ల మంజుల, గూళ్ల కవిత, ఇస్లావత్ గోపి, తొగరు చెన్నారెడ్డి, ఎడ్ల నారాయణరెడ్డి, పత్తి అనంతరెడ్డి, సీఈఓ చిట్టె రవి, సిబ్బంది ఉన్నారు.

ధ్వంసమైన పంటల వివరాల సేకరణ



నర్సంపేట రూరల్: రామవరంలో పంటలను పరిశీలిస్తున్న ఏఈఓ నవీన్, సర్పంచ్ రవి



వర్ధన్నపేట: కొత్తపల్లిలో..



ఖానాపురం: వివరాలు సేకరిస్తున్న ఏఈఓ

నర్సంపేట రూరల్ : వడగళ్ల వానకు పంటలు పూర్తిగా దెబ్బతిన్నడంతో నర్సంపేట మండల వ్యవసాయ విస్తరణ అధికారి నవీన్, సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు కొడారి రవి సోమవారం పంటలను పరిశీలించారు. ఈసందర్భంగా రవి మాట్లాడుతూ .. రెండురోజులు కురిసిన వర్షాలకు మండలంలోని పంటలన్ని పూర్తిగా దెబ్బతిన్నాయన్నారు. తక్షణమే నష్టపరిహారం అందించాలని, వానకు దెబ్బతిన్న విద్యుత్ స్తంభాల తొలగించి నూతన స్తంభాలను వేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ విమలశంకర్, వార్డు సభ్యులు కిషన్, రైతులు విజేందర్, కిరణ్, సంపత్, మోహన్, కోటేశ్వర్, నరేష్, మొగిళి, కిషోర్, పిట్టల సదానందం, వినోద్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

వర్ధన్నపేటలో.. పంట క్షేత్రాల సర్వే

వర్ధన్నపేట : మండలంలోని కొత్తపల్లి, బండౌతపురం, ఇల్లంద, ఉప్పరపల్లి, డీసీతండా, చెన్నారం తదితర గ్రామాల్లో సోమవారం మండల వ్యవసాయాధికారి రాంనర్సయ్య తమ బృందంతో పంట క్షేత్రాలను సందర్శించారు. కొత్తపల్లి గ్రామంలో మార్కెట్ కమిటీ చైర్మన్ కమ్మగోని స్వామిరాయుడు, పీఏసీఎస్ చైర్మన్ కొడగాని రాజేష్‌ఖన్నాతో కలిసి మొక్కజొన్న, మామిడి తోటలను సందర్శించారు. రాంనర్సయ్య మాట్లాడుతూ జరిగిన పంట నష్టంపై సర్వే నిర్వహించడం జరుగుతుందని పూర్తి నివేదిక రూపొందించి జిల్లా వ్యవసాయాధికారికి అందచేస్తామని వారు తెలిపారు.

ఖానాపురంలో..

ఖానాపురం : మండల వ్యాప్తంగా పలు గ్రామాల్లో వడగళ్ల వర్షాలతో పాటు ఆదివారం రాత్రి కురిసిన వర్షాలకు నష్టపోయిన పంటలను వ్యవసాయ అధికారులు పరిశీలిస్తున్నారు. ఆయా క్లస్టర్ల పరిధిలోని విస్తరణ అధికారులు వివరాల సేకరణ చేపట్టారు. అధికారులు, రైతులు పాల్గొన్నారు.

విద్యుత్ పునరుద్ధరణ త్వరగా చేయాలి

అకాల వర్షం కారణంగా విద్యుత్ పునఃరుద్ధరణ త్వరగా చేపట్టాలని డీఈ సదానందం సూచించారు. ఈ మేరకు ఖానాపురంతో పాటు పలు గ్రామాల్లో పునఃరుద్ధరణ పనులు పరిశీలిస్తూ సూచనలు చేశారు. ఆయన వెంట ఏడీఈ అమ్మనాయక్, ఏఈ సంతప్,తదితరులు పాల్గొన్నారు.

'ఎస్సారెస్పీ నీళ్లు ఇచ్చిన ఘనత వైఎస్సార్‌దే'

చెన్నారావుపేట : నర్సంపేట ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి అవగాహన లేని మాటలను తీవ్రంగా ఖండిస్తున్నామని కాంగ్రెస్ పార్టీ మండల నాయకుడు ఎడ్ల నారాయణరెడ్డి అన్నారు. సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. డీబీఎం-40 ద్వారా తానే నీళ్లు ఇచ్చామని పలికిన ఎమ్మెల్యే అవగాహన లేని మాటలు మాట్లాడుతున్నాడని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో అప్పటి సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ ప్రభుత్వం నీరందించిందన్నారు. కెనాల్‌పై చర్చకు సిద్ధంగా ఉన్నామని సవాల్ విసిరారు. ఈ సమావేశంలో పార్టీ గ్రామ అధ్యక్షుడు కశ్లపు రాజశేఖర్, మాజీ ఎంపీటీసీ రాములు, ఉప సర్పంచ్ నర్సింహరాములు, సంపత్, మల్లయ్య, రాజశేఖర్, యాకయ్య, కొంరయ్య, శ్రీను, శ్రీలత, రవీందర్ ఉన్నారు.

ఎమ్మెల్యే పెద్ది చొరవతోనే సమృద్ధిగా నీళ్లు

చెన్నారావుపేట మండలంలోని కోనాపురం గ్రామంలో డీబీఎం-40 ద్వారా గతంలో కంటే ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి చొరవతో నీళ్లు సమృద్ధిగా వస్తున్నాయని ఎంపీటీసీ గుండాల మహేందర్, గ్రామ పార్టీ అధ్యక్షుడు దొంగల రాజుకుమార్‌లు అన్నారు.

చెక్కుల పంపిణీ

రాయపర్తి : మండలంలోని తిర్మలాయపల్లిలో సోమవారం లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులను ఎంపీపీ జినుగు అనిమిరెడ్డి పంపిణీ చేశారు. సర్పంచ్ గజవెల్లి అనంతప్రసాద్, యాదగిరి ఉన్నారు.

గ్రామాల్లో మౌలిక సదుపాయాలు



నెక్కొండ: పనులను ప్రారంభిస్తున్న బాధ్యులు

నెక్కొండ : గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనే లక్ష్యంగా ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి కృషి చేస్తున్నారని నెక్కొండ పీఏసీఎస్ చైర్మన్ మారం రాము అన్నారు. మండలంలోని అమీన్‌పేటలో సోమవారం రూ. 5 లక్షల నిధులతో చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణ పనులను ఆయన ప్రారంభించి, మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ గరికపాటి హన్మంతరావు, ఉప సర్పంచ్ చిలుపూరి ఎల్లయ్య, కార్యదర్శి ప్రియాంక, బీఆర్ఎస్ నాయకులు తాటిపెల్లి శివకుమార్, కొమ్మారెడ్డి రవీందర్‌రెడ్డి, డోలి రవి, డెక్క సాయికుమార్, గరికపాటి స్రవంతి, మంద యాకయ్య, కుమారస్వామి, బత్తుల శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

చెన్నారావుపేటలో..

చెన్నారావుపేట : మండల కేంద్రంలోని 9వ వార్డులో సీసీ రోడ్డు నిర్మాణ పనులను వైస్ ఎంపీపీ కంది కృష్ణారెడ్డి సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈజీఎస్ ద్వారా రూ. 5 లక్షలు మంజూరు కావడంతో సీసీ రోడ్డు పనులు ప్రారంభించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ కో ఆప్షన్ సభ్యులు మహ్మద్ రఫీ, వార్డు సభ్యులు గొడిశాల సురేందర్, సుదర్శన్‌రెడ్డి, అశోక్‌రెడ్డి, రమేష్, కుమారస్వామిలు ఉన్నారు.

సంగెంలో..

సంగెం : మండల కేంద్రంలోని ఊర చెరువు మత్తడి నుంచి ఎస్సారెస్పీ కెనాల్ వరకు రూ.40లక్షల నిధులతో చేపట్టిన మెటల్ రోడ్డు నిర్మాణ పనులను సోమవారం ఎంపీపీ కళావతి ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు గుండేటి బాబు, ఎంపీటీసీ మల్లయ్య, నాయకులు సదయ్య, వీరస్వామి, మల్లికార్జున్, రాజారాం, శంకర్, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

విద్యుదాఘాతంతో 11 గొర్రెలు మృతి



చెన్నారావుపేట : విద్యుదాఘాతంతో 11 గొర్రెలు మృతి చెందిన ఘటన మండలంలోని మగ్దుంపురం గ్రామ శివారులో సోమవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. ఇదే గ్రామానికి చెందిన పల్లకొండ రమేష్ రోజువారిగా తన గొర్రెలను తీసుకోని మేపడానికి గ్రామ శివారులోకి వెళ్లాడు. ఈదురు గాలులతో కూడిన వడగళ్ల వర్షానికి విద్యుత్ తీగలు తెగిపడ్డాయి. విద్యుత్ సరఫరా నిలిపి లేకపోవడంతో మేత మేస్తూ వెళ్తున్న గొర్రెలు తీగలకు తగిలి విద్యుదాఘాతంతో అక్కడిక్కడే మృతి చెందాయి. గమనించిన రమేష్ విద్యుత్ అధికారులకు సమాచారం అందించడంతో సరఫరా నిలిపివేశారు. విద్యుత్ అధికారుల నిర్లక్ష్యంతోనే గొర్రెలు మృతి చెందాయని, రూ.లక్షా 10 నష్టం వాటిల్లిందని బాధితుడు ఆవేదనతో తెలిపారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి ఘటన స్థలానికి చేరుకుని గొర్రెలను పరిశీలించారు. ఆర్థికంగా ఆదుకుంటానని, విద్యుత్ అధికారులతో మాట్లాడి ప్రభుత్వం నుంచి నష్టపరిహారం అందేలా చర్యలు తీసుకుంటానని ధైర్యం చెప్పారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు బాధితుడు తెలిపాడు.

టీవీఎస్ ఎక్సెల్ వాహనం దగ్ధం



నెక్కొండ : ఓ బాలుడి నిర్వాకంతో టీవీఎస్ ఎక్సెల్ వాహనం దగ్ధమైన సంఘటన సోమవారం మండల కేంద్రంలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. మండలంలోని రెడ్లవాడ గ్రామానికి చెందిన దేవేందర్ ఈ నెల 19న స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో టీవీఎస్ ఎక్సెల్ వాహనాన్ని పెట్టి వెళ్లాడు. వాహనం తీసుకునేందుకు రావడంతో వాహనం దగ్ధమైందని గుర్తించి దేవందర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తులో భాగంగా కార్యాలయ సీసీ ఫుటేజీలను పరిశీలించారు. ఫుటేజీల ఆధారంగా రాత్రి ఓ బాలుడు వాహనం నుంచి పెట్రోల్ దొంగతనానికి పాల్పడ్డాడు. అనంతరం సిగరెట్ కాల్చుతున్న క్రమంలో పెట్రోల్ కారణంగా వాహనం అంటుకుంది. ఈ ప్రమాదంలో బాలుడు తృటిలో తప్పించుకున్నారని పోలీసులు పేర్కొన్నారు. మైనర్ కోసం గాలిస్తున్నట్లు వారు పేర్కొన్నారు. సుమారు రూ. 80 వేలు నష్టం వాటిల్లిందని బాధితుడు తెలిపాడు.



గీసుకొండ: కలెక్టర్ ప్రావీణ్యకు వినతిపత్రం అందజేస్తున్న కాంగ్రెస్ నాయకులు



నర్సంపేట రూరల్ : మాధన్నపేటలో.. ప్రకాశ్‌రెడ్డి



దుగ్గొండి: మందపల్లిలో..

పంట నష్టపరిహారం చెల్లించాలి

ఆరుగాలం కష్టపడి పండించి చేతికందే సమయంలో అకాల వర్షం వల్ల రైతులు తీవ్రంగా నష్టపోవడం బాధకరమని మాజీ ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి అన్నారు. అలాగే నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ. 25వేల ఆర్థికసాయం తక్షణమే అందించి అన్నదాతలకు భరోసా కల్పించాలని నాయకులు అధికారులకు వినతిపత్రాలు అందజేశారు. ఆయా గ్రామాల్లో వడగళ్ల వానకు దెబ్బతిన్న పంటలను సోమవారం ప్రజాప్రతినిధులు పరిశీలించారు.

\- సాక్షి నెట్‌వర్క్



సంగెం: పల్లారుగూడలో దెబ్బతిన్న పంటలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ధర్మారెడ్డి



నర్సంపేట: ఆర్డీఓ కార్యాలయంలో..



గీసుకొండ: కొమ్మాలలో.. విజయ్‌చందర్‌రెడ్డి



సంగెం: వినతి పత్రం అందిస్తున్న నాయకులు

సంక్షిప్త సమాచారం

దాడి చేయడం దుర్మార్గం

నర్సంపేట : ప్రజలను చైతన్య పరుస్తున్న క్యూ న్యూస్ చానల్‌పై దాడి చేయడం దుర్మార్గమని నర్సంపేట మున్సిపల్ ఫ్లోర్ లీడర్ వేముల సాంబయ్యగౌడ్ అన్నారు. క్యూ న్యూస్ కార్యాలయంపై దాడి చేయడం ప్రజాస్వామ్యంపై దాడి చేసినట్లేనని ఈ దాడిని ప్రజాస్వామ్యవాదులు, మేధావులు, యువత ఖండించాలన్నారు.

సదరం స్లాట్స్ బుకింగ్ సంఖ్యను పెంచాలి

నల్లబెల్లి : సదరం స్లాట్స్ బుకింగ్ సంఖ్యను పెంచాలని ఏబీఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి బొట్ల నరేష్ అన్నారు. ఈ మేరకు ఎంపీడీఓ కార్యాలయంలో డీఆర్‌డీఓ సంపత్‌రావుకు ఆ సంఘం ఆధ్వర్యంలో సోమవారం వినతి పత్రం అందించారు.

క్రీడా సామగ్రి అందజేత

చెన్నారావుపేట : మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో సోమవారం లీడ్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు కాసుల రవికుమార్ క్రీడా సామగ్రిని అందించారు. అలాగే లీడ్ లైబ్రరీ ఆధ్వర్యంలో ప్రారంభించిన గ్రంథాలయానికి పుస్తకాలు అందించారు.

గీతకార్మికుడికి తీవ్రగాయాలు

రాయపర్తి: మండలంలోని కొలన్‌పల్లి గ్రామానికి చెందిన పల్లె శ్రీనివాస్‌గౌడ్ వృత్తిలో భాగంగా సోమవారం తాటిచెట్టు ఎక్కి కల్లుగీస్తుండగా ప్రమాదవశాత్తు మోకు జారి కిందపడడంతో తీవ్ర గాయాలయ్యాయి. అనంతరం చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించినట్లు బంధువులు తెలిపారు.

క్షీరాభిషేకం

సంగెం : సెర్ప్ ఉద్యోగులకు కొత్త పే స్కేల్ జీఓ 11ను విడుదల చేసినందుకు కృతజ్ఞతగా సోమవారం ముఖ్యమంత్రి కేసీఆర్, మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, పరకాల ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డిల చిత్రపటాలకు సెర్ప్ ఉద్యోగులు క్షీరాభిషేకం నిర్వహించారు. ఏపీఎం కిషన్ ఆధ్వర్యంలో హర్షం వ్యక్తం చేశారు.

తైబజార్ వేలం

వరంగల్ (పర్వతగిరి) : మండలంలోని అన్నారం తైబజార్ వేలాన్ని సోమవారం గ్రామపంచాయతీ ఆవరణలో నిర్వహించారు. ఇందులో అన్నారం గ్రామానికి చెందిన ఎస్‌కె అంజాద్‌పాషా వేలం పాడి రూ.28లక్షల 200లకు వేలం దక్కించుకున్నారు.వేలంలో ఎంపీఓ పాక శ్రీనివాస్, సర్పంచ్ యశోద, పంచాయతీ కార్యదర్శి మోహన్, గ్రామ ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

ప్రిన్సిపాల్‌గా ప్రణయ్‌కుమార్ బాధ్యతలు

నెక్కొండ : నెక్కొండ ఆదర్శ పాఠశాల/కళాశాల ప్రిన్సిపాల్‌గా ఎం. ప్రణయ్‌కుమార్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా పాఠశాల అధ్యాపకులు, తదితరులు ఆయనను కలిసి పుష్పగుచ్ఛాలు అందించారు.

నియామకం

నర్సంపేట : మాదిగ హక్కుల దండోరా నర్సంపేట నియోజకవర్గ ఇన్‌చార్జ్‌గా మంచాల వెంకటేశ్వర్లు నియామకం అయ్యారు. ఈ మేరకు పట్టణంలోని అంబేడ్కర్ సెంటర్‌లో జిల్లా అధ్యక్షుడు బొట్ల రమేష్ అధ్యక్షతన సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మాదిగ హక్కుల దండోరా రాష్ట్ర కార్యదర్శి మెట్టుపల్లి కొమురయ్య ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు.

వర్షాలతో గీత కార్మికులకు అన్యాయం

నర్సంపేట : అకాల వర్షాలతో తాటిచెట్ల గెలలు విరిగి గీత కార్మికులకు తీవ్ర అన్యాయం జరిగిందని గౌడ జన హక్కుల పోరాట సమితి మోకు దెబ్బ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అనంతుల రమేష్‌గౌడ్ అన్నారు. ఈ మేరకు నియోజక వర్గంలోని ఆయా గ్రామాలలో తాటి వనాలను సోమవారం సందర్శించి పరిశీలించారు.